సాక్షి సిద్దిపేట

బుధవారం : 26 : ఏప్రిల్ : 2023



కుంభమేళా..

రాఘవాపూర్-హుమ్నాపూర్ గ్రామాల శివారులో గల పంచవటి క్షేత్రం సమీపంలోని మంజీర నది సమీపంలో(గరుడగంగ) కుంభమేళా ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. 8లో



రైతుల రాస్తారోకో

కొండపాక మండలంలోని బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లోని రైతులు మంగళవారం సాగు నీటి కోసం రాజీవ్ రహదారిపై రెండు చోట్ల వేర్వేరుగా రాస్తారోకో నిర్వహించారు. 8లో

గుండె పోటుతో ముగ్గురి మృతి

వేర్వేరు ఘటనల్లో ఉమ్మడి జిల్లాలో గుండెపోటుతో ముగ్గురు మృతి చెందారు. తురుకవాని కుంటలో పూడికతీత పనులు చేస్తుండగా ఒకరు, నారాయణఖేడ్ పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యుడు రాయల లక్ష్మణ్, గూడూర్ గ్రామ పంచాయతీకో ఆప్షన్ మెంబర్ గొల్ల బాలయ్యలు గుండె పోటుకు గురయ్యారు. 8లో..

న్యూస్‌రీల్

స్పౌజ్ బదిలీలు వెంటనే చేపట్టండి



నిరసన ర్యాలీలో ఉపాధ్యాయ దంపతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయ దంపతులకు ఒకే జిల్లాకు బదిలీచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 317 అమలులో భాగంగా దంపతులను వేర్వేరు జిల్లాలకు బదిలీ చేయడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భర్తొకచోట, భార్య మరో చోట, పిల్లలు ఇంకోచోట ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అసెంబ్లీలో గతంలో సీఎం కేసీఆర్ దంపతులు కోరుకున్న జిల్లాలకు బదిలీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లాలో 110 మంది స్పౌజ్ బదిలీలు అయ్యాయని, ఇంకా 110 మంది మిగిలి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం మానవత దృక్పథంతో స్పందించి బదిలీలు చేపట్టాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు.

జిల్లా ఉద్యానవనశాఖ అధికారిణిగా సునీత



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న సునీత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా ఉద్యానవనశాఖ అధికారిణిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన పి.సునీత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యానవన అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.


కవితలు సమాజానికి దిక్సూచి



మాట్లాడుతున్న డాక్టర్ మామిడి హరికృష్ణ

హుస్నాబాద్ : కవితలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం కవి సమ్మేళనం, కవితా సంపుటిలు ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థుల్లోని కవులు రచించిన కథలను మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. ఈప్రాంతంలో కవులు, రచయితలకు కొదవ లేదని ఆయన చెప్పారు. దేశానికి స్వాతంత్య్రం రాక ముందే స్థాపించిన పాఠశాల 75 ఏళ్ల జ్ఞాపకాలు, ఆత్మీయత పంచుకోవడం కోసం పూర్వ విద్యార్థులు వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం ఎక్కడా చూడలేదన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి శ్రీధర్ రాజు గీసిన '75 వసంతాలుగా విరామమెరుగని రైలు బండి.. విద్య సేవలో అలుపెరుగని మన పెద్దబడి' అనే సందేశం ఇచ్చే చిత్రాన్ని కరీంనగర్ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం బండారి మనీలకు అందజేశారు. కార్యక్రమంలో వజ్రోత్సవాల కమిటీ కన్వీనర్ కొండ లక్ష్మణ్, కవులు అన్నవరం దేవేందర్, గులాబీల మల్లారెడ్డి, ఫజుల్ రహమాన్, పందిళ్ల శంకర్, విధుమౌళి, వీరన్నయాదవ్, అన్నవరం సుజాత తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి బీఎఫ్‌హెచ్ఐ గుర్తింపు



హర్షం వ్యక్తంచేస్తున్న వైద్యులు, సిబ్బంది

గజ్వేల్: గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ ఇన్సియేటివ్(బీఎఫ్‌హెచ్ఐ) సర్టిఫికేట్ దక్కింది. ఈ విషయాన్ని మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ వెల్లడించారు. బీఎఫ్‌హెచ్ఐ సర్టిఫికేట్ 2023 ఏప్రిల్ నుంచి 2026 ఏప్రిల్ వరకు వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన ప్రభుత్వాసుపత్రుల్లో గజ్వేల్ మూడోదని ఆయన వివరించారు. డబ్ల్యూహెచ్‌వో, యూనిసెఫ్‌ల ఆధ్వర్యంలోని బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్టు ఇండియా మిషన్‌లో భాగంగా బీఎఫ్‌హెచ్ఐ ద్వారా బిడ్డకు తల్లిపాల ప్రాముఖ్యత వివరించడం.. పుట్టిన బిడ్డకు తొలి అర గంటలోనే ముర్రుపాలు తాగించడం..బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు తాపించే విధంగా తల్లులకు అవగాహన కల్పించే హాస్పిటళ్లకు ఈ అక్రెడిషన్ ఇస్తారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు

- కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మొద్దు
- ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



చిన్నకోడూరు : మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, వేదికపై ప్రజాప్రతినిధులు, లీడర్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయని.. నాడు చిన్నకోడూరు మండలం అంటే కరువు.. నేడు కల్పతరువని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలం మెట్టుబండలు వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అధ్యక్షతన నియోజకవర్గ బీఆర్ఎస్ ప్లీనరీ, మండల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతకుముందు చిన్నకోడూరు, మెట్టుబండలు వద్ద పార్టీ భారీ జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ లేకపోతే తెలంగాణ , సిద్దిపేట జిల్లా కాకపోయేవని, గోదావరి నీళ్లు, రైలు రాకపోయేదన్నారు. తెలంగాణలో ఏ ఎన్నికలు జరిగినా గెలుపు బీఆర్ఎస్‌దే అన్నట్లుగా పార్టీ చరిత్ర సృష్టించిందన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయని బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు నిందలు వేస్తున్నారని, ఊర్లకు వచ్చిచూస్తే అభివృద్ధి అంటే ఏంటో కనిపిస్తుందన్నారు. నిజాలు ఖచ్చితంగా మాట్లాడాలి.. ప్రచారం చేయాలి.. లేదంటే అబద్ధాలు రాజ్యం ఏలుతాయని అంబేడ్కర్ చెప్పారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఏఎంసీ చైర్మన్ వనిత, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంజుల, సీనియర్ నాయకులు బాల్‌రాంగం, పాల సాయిరాం, చిన్నా, శ్రీహరి యాదవ్, మోహన్ లాల్, రాంచంద్రారెడ్డి, భూపేష్, పాపయ్య, కనకరాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి..

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదరిక నిర్మూలన కోసం, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కేంద్రంలోని బీజేపీ కాపీ కొడుతుందన్నారు. దేశ ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు.

మళ్లీ హరీశ్‌రావే పోటీచేయాలి..

ప్లీనరీలో వివిధ అభివృద్ధి అంశాలు, కేంద్ర ప్రభుత్వ వివక్షపై 12 తీర్మాణాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. వ్యవసాయం, గోదావరి జలాలు, సిద్దిపేట జిల్లా ఏర్పాటు, రహదారులకు రాచబాటలు, సిద్దిపేట మంచి నీళ్ల మణిహారం, విద్యా, వైద్యం , సంక్షేమం, క్రీడలు, పట్టణ ప్రగతి, ఉపాధి హామీకి ఉరి, ఏటా 12 కోట్ల ఉద్యోగాలు ఎక్కడా? మోటార్లకు మీటర్లు అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టగా ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, సభ్యులు ఆమోదించారు. మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట నుంచే మళ్లీ పోటీచేయాలని తీర్మానించారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలను తిప్పికొట్టాలి

గజ్వేల్: అసాధ్యాలను కేసీఆర్ సుసాధ్యం చేశారని, ప్రస్తుతం తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం గజ్వేల్ లోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి బీజేపీకి వెన్నులో వణుకు పుడుతోందన్నారు. దీంతో ఆ పార్టీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. అబద్ధాలను ప్రచారం చేస్తూ తెలంగాణ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న కేంద్రానికి తగిన విధంగా బుద్ధి చెప్పాలంటే మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించిన విధంగా నిజాలను ప్రచారంలో ఉంచాలన్నారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. గజ్వేల్‌కు స్టేడియం మంజూరు చేయిస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.

గజ్వేల్‌లో కేసీఆర్ పోటీపై చర్చ

కేసీఆర్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ పోటీ అంశంపై సమావేశంలో మరోసారి చర్చకు వచ్చింది. నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నేతల తమ ప్రాంతాల్లో పోటీ చేయాలని డిమాండ్ చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు ప్రస్తావించగా.. 'వద్దు వద్దు. కేసీఆర్ మరోసారి గజ్వేల్ నుంచే పోటీ చేయాలి' అని కార్యకర్తలు, నాయకులు డిమాండ్ చేస్తూ చప్పట్లు కొట్టారు. ఒకప్పుడు ఆసోకర్యాలకు, ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న గజ్వేల్ కేసీఆర్ ప్రాతినిధ్యంతో రూపురేఖలు మారాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ పరిశీలకులు బోడకుంట్ల వెంకటేశ్వర్లు, మెదక్ జెడ్పీ చైర్మన్ హేమలత, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్, ములుగు మార్కెట్ కమిటీల చైర్మన్లు మాదాసు శ్రీనివాస్, జహంగీర్, గజ్వేల్ ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిలర్ దేవీ రవీందర్, నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, తూప్రాన్, మనోహరాబాద్, మర్కూర్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆర్ద్రా మహోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

కొండపాక(గజ్వేల్): కోరిన కోర్కెలు తీర్చే ఆలయంగా వెలుగొందుతున్న మర్పడగలోని విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం ఆర్ద్రా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు గణపతి పూజతో ప్రారంభమై స్వస్తి హవచనం, నవగ్రహ దిక్పాలక స్థాపన రుద్రాక్షల స్థాపన, స్థాపితా దేవతాపూజ, సంతాన మల్లికార్జున స్వామికి మహన్యాస పూర్వక సంతాన పాశుపథం, విశేశ పంచాభృత ఫల రస అభిషేకం నిర్వహించారు. సుబ్రమణ్య స్వామికి సర్పసూక్తంతో అభిషేకం నిర్వహించారు. నవగ్రహాలకు దంపతులు పాలాభిషేకం చేశారు. సుబ్రహ్మణ్య స్వామికి సర్పసూక్తంతో అభిషేకం నిర్వహించారు. బ్రాహ్మణుల మంత్రోచ్చారణలతో సంతాన పాశుపత హోమం, నవగ్రహ నక్షత్ర హవనం, పూర్ణాహుతి కన్నుల పండువగా సాగింది. ఈసందర్భంగా క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ మాట్లాడుతూ దేవాలయాల దర్శనం ప్రశాంతతకు నిలయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మోహన్ దాస్, చిటుకుల నర్సింహ్మారెడ్డి, చీకోటి మల్లికార్జున్, దేవసాని మల్లేశం, తిరుపతిరెడ్డి, రవి, రాజేంద్ర ప్రసాద్, రాంచంద్రారెడ్డి వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మొదటి గంట గోల్డెన్ అవర్

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్

సిద్దిపేటకమాన్: ఏ ప్రమాదమైనా జరిగిన మొదటి గంట గోల్డెన్ అవరని సిద్దిపేట అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సమీపంలో ఉన్నవారు తీసుకోవాల్సిన చర్యలపై గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మంగళవారం సీపీ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది, యువతకు శిక్షణ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఫస్ట్ రెస్పాండెంట్ ప్రథమ చికిత్స, సీపీఆర్, ఏఈడీ (ఆటోమెటిక్ ఎక్స్‌టర్నల్ డెఫిబ్రిలేషన్)పై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాద తీవ్రతను గుర్తించి కాపాడడానికి ప్రతీ ఒక్కరు ప్రయత్నించాలన్నారు. ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను గుర్తించి వివిధ శాఖల అధికారులతో కలసి నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆపదలో వారిని ఆదుకోవడం అందరి కర్తవ్యమన్నారు. అత్యవసర పరిస్థితి ఎలా గుర్తించాలి? రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేయడం.. ఆసుపత్రికి తరలించడం తదితరాలపై ఈఎంఆర్ఐ క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్ సుమన్, టెక్నికల్ రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలి



జెండాఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ కాశీనాథ్

సిద్దిపేటకమాన్: పరిసరాల్లో నీరునిల్వ ఉండకుండా చూడాలని, ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని డీఎంహెచ్ఓ కాశీనాథ్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినిలతో కలిసి నిర్వహించిన మలేరియా అవగహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ కాశీనాథ్ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకుందామన్నారు. జ్వరం, చలి, వణుకుతో కూడిన తీవ్రమైన జ్వరం, తలనొప్పి, రోజు విడిచి రోజు జ్వరం రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. మలేరియా నిర్ధారణ జరిగితే చికిత్సలు చేయించుకోవాలని కోరారు. ఇళ్లలోని పనికిరాని పాత్రలు, టైర్లు, బకెట్లు వంటి వాటిల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమల మందు పిచికారీ చేసేందుకు సిబ్బంది వచ్చినప్పుడు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా ప్రోగ్రాం అధికారి ప్రభాకర్, డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ ఎజిల్‌రసాన్, శ్రీనివాస్‌రెడ్డి, కొండయ్య, చక్రధర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

సిద్దిపేటఎడ్యుకేషన్: పర్యావరణాన్ని పరిరక్షించుకోకుంటే జీవజాలం అంతరించి పోతుందని ఎర్త్ సెంటర్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ సాయిభాస్కర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మంగళవారం పర్యావరణ విద్య, సుస్థిర అభివృద్ధి అనే అంశంపై ఒకరోజు జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సాయిభాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన 18 సుస్థిర అభివృద్ధి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాలుష్యం పెరగడానికి గల కారణాలను భవిష్యత్‌లో జరిగే భూపరిణామాన్ని, జలకాలుష్యం తదితర అంశాలు వివరించారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సెక్రటరీ డాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బోధనాంశంగా పర్యావరణ విద్యను చేర్చాలన్నారు. విద్యార్థులచే సీడ్ బాల్స్ తయారుచేసి వృక్ష రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. అంతకు ముందు సెమినార్ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ మధుసూదన్, కన్వీనర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాలసుదర్శనం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ పల్లవి, డాక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథం పాల్గొన్నారు.

రైతు నెత్తిన వడగండ్లు



ఈ ఫొటోలోని రైతు పేరు ఏర్పుల యాదయ్య. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామం. ఈయన నాలుగు ఎకరాల్లో వరిసాగుచేశాడు. ఎకరాకు రూ.30 వేల చొప్పున రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టాడు. ఇంకో మూడు రోజుల్లో పంట చేతికొస్తుందన్న టైంలో వడగండ్ల వర్షం దంచికొట్టింది. పంట అంతా నేలరాలడంతో యాదయ్య పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇది యాదయ్య పరిస్థితి కాదు..జిల్లా వ్యాప్తంగా రైతుల దుస్థితి.



సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ పాటిల్

- నిండా ముంచిన అకాల వర్షం
- రైతు కంట కన్నీరు
- జిల్లాలో 36, 738 ఎకరాల్లో పంట నష్టం
- అంచనా వేసిన వ్యవసాయ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో ఈ యాసంగిలో వరి 3,46,797 ఎకరాలు, మొక్కజొన్న 16,883, పొద్దుతిరుగుడు 7,228, ఇతర పంటలు 5,804, కురగాయలు నాలుగు వేల ఎకరాల్లో సాగయ్యాయి. మామిడి తోటలు 14 వేల ఎకరాల్లో పెరుగుతున్నాయి. వాతావరణంలో ఏర్పడిన మార్పులతో మూడు రోజులుగా ఈదురు గాలులు వీస్తున్నాయి. వడగండ్ల వర్షం దంచికొడుతోంది. పంటలన్నీ నేలపాలవుతున్నాయి. వర్షాలతో మొక్కజొన్న 380 ఎకరాల్లో, వరి 33,338, సన్‌ఫ్లవర్ 21, మామిడి 2,816, కూరగయాలు 183 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. సిద్దిపేట రూరల్, కొమురవెల్లి, మద్దూరు, చేర్యాల, తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక, జగదేవ్‌పూర్, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో భారీగా పంట నష్టం వాటిల్లింది. సోమవారం ఒక్కరోజే జిల్లాలో 21 వేల ఎకరాల పంట వడగండ్ల పాలైంది. సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆయా మండలాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి తెలుసుకున్నారు. అకాల వర్షాలు మరిన్ని రోజుల పాటు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులు, వడగండ్ల వర్షంతో జిల్లాలోని పలు విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నెలకొరిగాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం దూళిమిట్ట మండలంలో 82.5 మిల్లీ మీటర్లు నమోదైందని అధికారులు తెలిపారు.

రాలిన వడ్లు.. కూలిన వృక్షాలు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల, కొమురవెల్లి మండలాల పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన వడగండ్లవానతో వేల ఎకరాల్లో వరి నేలవాలింది. ఆయా గ్రామాల్లో ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. పాత ఇండ్లు కూలాయి. మామిడి కాయలు రాలిపోగా, పౌల్ట్రీఫామ్‌లో కోళ్లు మృతి చెందాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు తడిసాయి. కడవేర్గు మీదుగా నాగపురి వెళ్లే దారిలో చెట్లు నేలకొరిగాయి. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చేర్యాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



కొమురవెల్లి బడిలో కూలిన చెట్టు

36,738 ఎకరాల్లో పంట నష్టం



ఈదురుగాలులు, వడగండ్ల వర్షంతో జిల్లాలో ఇప్పటి వరకు 36,738 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశాం. మరో ఐదురోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం వివరాలు సేకరిస్తాం. నివేదకను ప్రభుత్వానికి అందజేస్తాం.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

నష్టం వివరాలు తక్షణం సేకరించాలి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- సిద్దిపేట రూరల్ మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలన

సిద్దిపేటరూరల్: పంటల నష్టం వివరాలు యుద్ధప్రాతిపదికన సేకరించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఆయన వర్షాలు.. వడగండ్లతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ పరిధిలోని రాఘవాపూర్ గ్రామాల్లో పర్యటించారు. వడగండ్ల వానతో ధాన్యం అంతా నేలరాలిందన్నారు. ఏడీఏ, ఏఈఓ ఇతర అధికారుల ఆధ్వర్యంలో నష్టం వివరాలు సేకరిస్తారని వెల్లడించారు. దెబ్బతిన్న పంటల విస్తీర్ణం, సర్వే నంబర్ల వారీగా రెండు రోజుల్లో పంచాయతీ కార్యాలయంలో అతికిస్తామన్నారు. అర్హత లేని రైతులు ఉంటే జాబితా నుంచి తొలగిస్తామన్నారు. రెండురోజుల్లో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు వివరాలు సేకరిస్తారని తెలిపారు. తెగిపడ్డ విద్యుత్ లైన్ల వివరాలు విద్యుత్ శాఖ ఎస్ఈ, ఏడీ తెలుసుకుంటారని పేర్కొన్నారు. కౌలు రైతులకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. కలెక్టర్ వెంట అగ్రికల్చర్ ఏడీఏ, తహసీల్దార్లు, ఏవోలు పర్శరాంరెడ్డి, ఏఈఓలు సుమిత్ర తదితరులు ఉన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, వడగండ్లతో మండలంలో 13, 984 ఎకరాలకు నష్టం జరిగినట్లు అంచనా వేశామని డీఏఓ శివప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని పలుగ్రామాల్లో పర్యటించి పంటల నష్టం వివరాలు సేకరించారు. వరి, మొక్కజొన్న, సన్‌ఫ్లవర్ తదితర పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకారని రూ.10 వేలు అందిస్తుందని తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, గాగ్గిళ్లపూర్ సర్పంచ్ బొడ్డు కృష్ణవేణిచంద్రమౌళి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్కూరి కమాలకర్ యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ మ్యాక మల్లేశం, చేర్యాల ఏడీఏ రాధిక, ఏఈవో రాకేశ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 29 మంది పట్టుబడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో మంగళవారం హాజరుపర్చగా జడ్జి 27 మందికి ఒక్కొక్కరికీ రూ.2వేలు, మరో వ్యక్తికి రూ.3 వేలు, ఇంకొక వ్యక్తికి రూ. 5వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని బీజేఆర్, నర్సాపూర్, బస్టాండ్ చౌరస్తాల్లో తమ సిబ్బందితో మూడు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 8 మంది మందుబాబులు పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి రమేష్‌బాబు వారికి రూ.20వేల జరిమానా విదించినట్లు సీఐ తెలిపారు.

మేడే విజయవంతం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

జహీరాబాద్ టౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో మంగళవారం నిర్వహించిన సీఐటీయూ జహీరాబాద్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో పోరాటాలు, ఎంతో మంది త్యాగాల ఫలితంగా పనిగంటల తగ్గింపు, కార్మిక చట్టాలు, హక్కులను సాధించుకున్నామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, మహీంద్ర కార్మిక సంఘం యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు నాగమణి, నందమ్మ, మొగులయ్య, యశోదమ్మ పాల్గొన్నారు.

పూరిగుడిసెలు దగ్ధం

చేగుంట(తూప్రాన్): ప్రమాదవశాత్తు రెండు గుడిసెలు దగ్ధమైన సంఘటన పులిగుట్ట తండాలో చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం..చందర్, రతన్‌లు అన్నదమ్ములు. వీరిద్దరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరి గుడిసెలకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోగా తండావాసులు మంటలు ఆర్పే ప్రయత్నంచేసినా ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో బియ్యం, నగదు, నిత్యవసర సరుకులు, బట్టలు కాలిపోయాయి. నష్టపోయిన గిరిజనులను ఆదుకోవాలని ఎంపీటీసీ హోలియానాయక్ కోరారు.

ప్రాణం తీసిన ఈత సరదా..


రాహుల్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): ఈత సరదా యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన మిరుదొడ్డి మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్ఐ శ్రీధర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లుపల్లి గ్రామానికి చెందిన పాలమాకుల మల్లేశం స్వరూపాల కుమారుడు రాహుల్ (24) వ్యవసాయం చేసుకుంటూ..కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. గ్రామ శివారులో ఉన్న చెరువులోకి మంగళవారం ఈతకు వెళ్లాడు. కొంత దూరం వెళ్లి తిరిగి వెనకకు వస్తున్న క్రమంలో ఊపిరాడక నీట మునిగి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుంభమేళా..

తరలివస్తున్న సాధువులు


పంచవటి క్షేత్రంలో శ్రీ శారదాదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు


మంజీర నది వద్ద పూజలు చేస్తున్న సాధువులు


పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు


భజన చేస్తున్న చిన్నారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులో గల పంచవటి క్షేత్రం సమీపంలోని మంజీర నది సమీపంలో(గరుడగంగ) కుంభమేళా ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం కూడా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మంజీర నదిలో పుణ్యస్నానాలు చేసి గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచవటి క్షేత్రంలో వెలసిన శారదాదేవి, సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, శనీశ్వరాలయాల్లో పూజలు చేసి దైవదర్శనం చేసుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా సాధువులు

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సాధువులు కుంభమేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పంచవటి క్షేత్రంలో వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారి వద్దకు వెళ్లే భక్తులకు సాధువులు దీవించి ఆశీస్సులు అందజేశారు. కొందరు సాధువులు అక్కడ దిగంబరులై ఉండడంతో భక్తులు వారిని చూస్తూనే ఉండిపోయారు. సాధువులు నృత్యాలు చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం క్షేత్ర ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పలువురు పీఠాధిపతులు హాజరయ్యారు. వారు ఆధ్యాత్మికత, కుంభమేళా ప్రాముఖ్యతపై భక్తులకు వివరించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కూచి పూడి కళాబృందం నిర్వహించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలకు చెందిన చిన్నారులు నిర్వహించిన కళా ప్రదర్శన ఆకట్టుకునాయి.

కొనసాగుతున్న అన్నదానం

కుంభమేళ సందర్భంగా వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్నదానం కొనసాగుతుంది. భక్తులకోసం రోజుకొకరు దాతలు అన్నదానం చేస్తున్నారు.

అదృశ్యమైన రైతు మృతదేహం లభ్యం


దుర్గయ్య (ఫైల్)

జోగిపేట(అందోల్): నాలుగు రోజుల ముందు అదృశ్యమైన రైతు దుర్గయ్య(40) అదే గ్రామంలో జొన్న పంటలో శవమై తేలిన సంఘటన మంగళవారం జరిగింది. ఎస్ఐ సామ్యానాయక్ కథనం ప్రకారం..అందోల్ మండల పరిధిలోని మక్తగూడెంకు చెందిన కోడూరు శంకర్, గొంగ్లూర్ దుర్గయ్యలు వారి పంట పొలాల్లో పత్తి కట్టే తీసివేసి, ట్రాక్టర్ ద్వారా దున్నేందుకు ఈ నెల 20న ఇద్దరు కలిసి వెళ్లారు. అదేరోజు మధ్యాహ్నం తాలెల్మ గ్రామానికి వెళ్లి కల్లు సేవించారు. అనంతరం పొలంలో శంకర్ ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా దుర్గయ్య ట్రాక్టర్ టైరు కిందకు పడిపోయాడు. ట్రాక్టర్ చక్రం అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. ఆందోళన చెందిన శంకర్ తనపై కేసు అవుతుందని భయంతో దుర్గయ్య మృతదేహాన్ని పక్కనే ఉన్న మిద్దెల రాంరెడ్డి జొన్న పంటలో పడేశాడు. మృతుడి కుటుంబ సభ్యులు దుర్గయ్య కోసం ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో ఈ నెల 23న జోగిపేట పోలీస్ స్టేషన్లో మృతుడి భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యంగా కేసు నమోదుచేశారు. శంకర్‌పై అనుమానంతో విచారణ చేయగా జరిగిన విషయాన్ని ఒప్పుకున్నాడు. నిందితుణ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


ప్రశాంత్ మృతదేహం

అల్లాదుర్గం(మెదక్): శుభకార్యానికని వెళుతూ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర గ్రామ శివారులో 161 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ జిల్లా రేగోడ్ గ్రామానికి చెందిన వనం దుర్గయ్య గత కొంత కాలంగా హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉంటున్నాడు. ఇతనికి ముగ్గురు కొడుకులు. పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లి గ్రామంలో దుర్గయ్య ముగ్గురు కొడుకులతో శుభకార్యానికని వెళ్తుండగా కొడుకులు ప్రశాంత్, పవన్, అశోక్‌లు బైక్‌లపై బయలుదేరారు. చిల్వెర శివారుకు రాగానే ప్రశాంత్(20) నడుపుతున్న బైక్ ముందు వెళ్లుతున్న కంటైనర్ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక భాగం ప్రశాంత్ తలకు బలంగా తాకి కింద పడ్డాడు. ప్రశాంత్ తల పగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తమ్ముడు వెనుక కూర్చోవడంతో స్వల్ప గాయాలవ్వడంతో అంబులెన్స్‌లో జోగిపేట ఆస్పత్రికి తరలించారు. మరో బైక్‌పై వస్తున్న అన్న అశోక్ ఈ సంఘటనను చూసి బోరున విలపించాడు. మృతుడి అన్న అశోక్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్థిక నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): ఆర్థిక నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి టౌన్ సీఐ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, ఫోక్స్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ..యువత ఇంటర్నెట్‌లో, ఆన్‌లైన్ మోసాలకు గురి అవుతున్నారని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్మార్ట్ ఫోన్‌లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయకూడదన్నారు. అదేవిధంగా మన వ్యక్తిగత ఆర్థిక సమాచారాన్ని అపరిచిత వ్యక్తులకు అందించొద్దని సూచించారు. ఏ బ్యాంకులు కూడా మన అకౌంట్‌కు సంబంధించి వ్యక్తిగత సమాచారంపై ఫోన్‌లో సంప్రదించరని, అలాంటి ఫోన్ కాల్స్ వస్తే బ్యాంకుకు వెళ్లి సమాచారాన్ని అందించాలన్నారు. ఎవరైనా సైబర్ క్రైమ్‌కు గురైతే టోల్ ఫ్రీ1930 నంబర్‌కు 24 గంటల లోపు సమాచారం అందిస్తే కొంతమేర ఫలితం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మహిళల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, మహిళలను ఇబ్బందులకు గురి చేస్తే నాన్‌బెయిలబుల్ ఎఫ్ఐఆర్ నమోదవుతుందన్నారు. 18 సంవత్సరాలలోపు అమ్మాయిలను వేధిస్తే ఫోక్సో చట్టం కిందికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రత్న ప్రసాద్, ఎస్ఐ నరేష్, షీ టీం ఎస్ఐ మొగులయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వెంకటేశం, డాక్టర్ పద్మజ, డాక్టర్ సిద్ధులు, డాక్టర్ అభిజిత్, శివదీప్తి, అధ్యాపకులు డాక్టర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుతో ముగ్గురి మృతి


ధరావత్ పాండు


గొల్ల బాలయ్య


రాయల లక్ష్మణ్ (ఫైల్)

వేర్వేరు ఘటనల్లో గుండెపోటుతో ముగ్గురు మృతి చెందారు. తురుకవానికుంటలో పూడికతీత పనులు చేస్తుండగా ఒకరు, నారాయణఖేడ్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యుడు రాయల లక్ష్మణ్, గూడూర్ గ్రామ పంచాయతీ కోఆప్షన్ మెంబర్ గొల్ల బాలయ్యలు గుండెపోటుకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కుషన్‌గడ్డతండాలో గుండెపోటుతో ఉపాధిహామీ కూలీ మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషన్‌గడ్డతండాకు చెందిన ధరావత్ పాండు(60) భార్య చెన్నమ్మతో తురుకవానికుంటలో పూడికతీత పనులకు వెళ్లాడు. అక్కడ పాండు పనులు చేసేందుకు మస్టర్‌లో తన పేరునమోదు కాలేదని చెప్పాడు. దీంతో తిరిగి ఇంటికి వెళ్లాలనుకున్నాడు. కాగా భార్య ఇతర తండావాసులు అక్కడే పనులు చేస్తుండటంతో అతను కూడా పనిచేయదలచి గడ్డపారతో తవ్వేక్రమంలో ఒక్కసారిగా గుండెపోటుతో కిందపడి పోయాడు. దీన్ని గమనించిన కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్‌కు సమాచారం చేరవేశారు. బాధితున్ని నర్సాపూర్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.

జీపీ కో ఆప్షన్ మెంబర్

శివ్వంపేట(నర్సాపూర్): గూడూర్ గ్రామ పంచాయతీ కో ఆప్షన్ మెంబర్ గొల్ల బాలయ్య(65) గెండెపోటుతో మృతిచెందాడు. అస్వస్థతకు గురైన బాలయ్యను గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో గుండెపోటుతో అప్పటికే అతను మృతిచెందినట్లు గుర్తించారు. బాలయ్య మృతిపట్ల పంచాయతీ పాలకవర్గం, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మాజీ వార్డు సభ్యుడు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యుడు రాయలలక్ష్మణ్ (35)గుండెపోటుతో మృతి చెందాడు. ఇంట్లోనే గుండెపోటుకు గురైనట్లు గుర్తించిన కుంటుంబీకులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్ళగా అప్పటికే మృతిచెందినెట్లు వైద్యులు నిర్ధారించారు. కురుమసంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ యాదవ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు మున్వర్ ఖురేషి, సురేష్, పండరిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

సీఈఐఆర్‌తో ఫోన్ల రికవరీ


పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ సహకారంతో పోగొట్టుకున్న సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు మంగళవారం ఎస్పీ రమణ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర టెలీకాం మంత్రిత్వ శాఖా ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ఉపయోగకరంగా ఉందన్నారు. చింతల నిఖిల్ సంగారెడ్డి, బసవరాజ్ ప్రభుత్వ ఉద్యోగి, మోహన్ నాయక్, విజయనగర్ కాలనీ, పెద్దదొడ్డి రాహులు, గుమ్మడిదలకు చెందిన భానూరి మల్లేశం వీరు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకొని సీఈఐఆర్ పోర్టల్‌తో బ్లాక్ చేసి పోలీస్ స్టేషన్లో సమాచారం అందించారు. పోలీసులు ఆ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. వారం రోజుల వ్యవధిలోనే సుమారు 10 ఫోన్లను రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రతీ ఒక్కరూ సీఈఐఆర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

సైకిల్‌పై నుంచి పడి గాయాలు

పాపన్నపేట (మెదక్): సైకిల్‌పై నుంచి పడి తీవ్ర గాయాల పాలైన బాలుణ్ని 108 సిబ్బంది గాంధీ ఆస్పత్రికి తరలించారు. పాపన్నపేట పెద్ద హరిజన వాడకు చెందిన వంశీ సైకిల్ తొక్కుతు బండ రాయిపై పడడంతో చిన్న ప్రేగు బయటకు వచ్చింది. కుటుంబీకులు పాపన్న పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు.

టీవీఎస్ ఎక్సెల్ అదుపు తప్పి..

దుబ్బాకరూరల్: టీవీఎస్ ఎక్సెల్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మాష్టి శ్రీకాంత్(35)భూంపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి పోతారెడ్డిపేట వైపు వెలుతున్నాడు. సబ్ స్టేషన్ సమీపంలోకి రాగానే టీవీఎస్ ఎక్సెల్ రోడ్డు ప్రక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అంబులెన్స్ సిబ్బంది అతణ్ని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వారు గుర్తించారు.

పిడుగు పాటుకు మూగజీవాల మృత్యువాత


జేపీ తండాలో ఆవు


ఎడ్లరేగడి తండాలో మృతి చెందిన ఎద్దు

నంగునూరు(సిద్దిపేట): పిడుగు పాటుకు గురై మూగ జీవాలు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జేపీ తండా, ఖానాపూర్ గ్రామాల్లో చోటు చేసుకుంది. జేపీ తండాకు చెందిన పిట్టల బాలయ్య రోజు మాదిరిగానే వ్యవసాయ బావి దగ్గర కొట్టంలో పాడి ఆవును కట్టేశాడు. రాత్రి ఉరుములతో వర్షం కురవడంతో చెట్టుపై పిడుగు పడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు చింతల బిక్షపతి పాడి గేదెను వ్యవసాయ బావి వద్ద చెట్టుకు కట్టి వేయగా పిడుగు పడడంతో మృతి చెందింది. సర్పంచ్‌లు బిక్షపతినాయక్, సత్తవ్వ, సతీష్ రైతులను ఓదార్చి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామన్నారు.

ఎడ్లరేగడి తండాలో

కంగ్టి(నారాయణఖేడ్): ఉరుములు, పిడుగులతో కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో పశువులు మృతి చెందిన సంఘటన కంగ్టి మండలంలో చోటు చేసుకుంది. అకాల వర్షానికి ఎడ్లరేగడితండా శివారులో బన్యానాయక్‌కు చెందిన ఎద్దు, నారాయణకు చెందిన ఆవు మృతిచెందినట్లు సర్పంచ్ బల్‌రాం తెలిపారు. కాగా జమ్గి(కే) గ్రామపొలిమేరల్లో గొర్రెలు మేపుతున్న సమయంలో పిడుగు పడి ఒక గొర్రె మృతి చెందగా కాపరి గైని గౌతమి(24) అస్వస్థతకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను బాన్సువాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

భెల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి


భాస్కర్ గౌడ్ మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీబీహెచ్ఈఎల్ పరిశ్రమలోని 4వ బ్లాక్ సమీపంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు రేకుల పైనుంచి కిందపడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం..హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రాంతానికి చెందిన భాస్కర్ గౌడ్(39) భెల్ పరిశ్రమలో కాంట్రాక్టర్ రమేశ్ పరిధిలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో భాస్కర్ గౌడ్ 4 బ్లాక్ సమీపంలో షెడ్ పైకి ఎక్కి ఫ్యాన్‌ను బిగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రగాయలపాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..


రవికుమార్ మృతదేహం

జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి క్రాస్ రోడ్డు వద్ద 65వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రవికుమార్(32) మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం..కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామానికి చెందిన బేగరి రవికుమార్ మోటారు సైకిల్‌పై జహీరాబాద్ వెళ్లి పూజా సామగ్రి కొనుగోలు చేసుకుని దిగ్వాల్ వెళుతున్న క్రమంలో హుగ్గెల్లి క్రాస్ రోడ్డు వద్ద ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య కాజల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.35వేలు, 3తులాల బంగారం, 30తులాల వెండి అపహరణ


చిందరవందరగా పడేసిన వస్తువులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలో తాళం వేసిఉన్న ఓ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి..పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్ వెనుక నివాసముంటున్న బాల్‌చంద్రం కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. అనంతరం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండగా బీరువాలోని బట్టలు చిందరవందరగా పడి ఉండడాన్ని వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలోని రూ. 35వేలు, 3తులాల బంగారం, 30తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు వారు గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లో సోమవారం రాత్రి కురిసిన గాలి వానకు మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి..మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చెట్టుకూలి విద్యుత్ వైర్లపై పడటంతో అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. ఉదయం అధికారులు వచ్చి చెట్టును పక్కకు నెట్టి ఆఫీసు లోపలికి వెళ్లడానికి దారి చేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఎంపీడీఓ, ఐకేపీ, ఐసీడీఎస్, పీఆర్ డీఈ, ఇరిగేషన్, ఎస్టీఓ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

టేక్మాల్(మెదక్): ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లిలో జరిగింది. స్థానికులు వివరాల ప్రకారం..హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్ వైపు వెలుతున్న ఆర్టీసీ బస్సు, సయ్యద్ తాజోద్దీన్, ఎండీ హారీఫ్‌ఖాన్‌లు బైక్‌పై అల్లాదుర్గం నుంచి జోగిపేట వైపు వస్తుండగా బొడ్మట్‌పల్లి చౌరస్తాలో ఢీకొన్నాయి. తీవ్ర గాయాలైన ఇద్దరిని స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

అల్లుడే కుటుంబాన్ని అంతమొందించాలని..

- విద్యుదాఘాతాన్ని తప్పించుకున్న తల్లీ కూతురు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ

నారాయణఖేడ్: అల్లుడే భార్య, అత్తామామ, కుటుంబ సభ్యులను విద్యుదాఘాతానికి గురిచేసి అంతమొందించాలని యత్నించిన సంఘటన నారాయణ ఖేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ, ఎస్ఐ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం..ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్ గ్రామానికి చెందిన దనియాల రాములు గత నెల 13న రాత్రి ప్రతీ రోజులాగే తన ఇంట్లో భార్య రామవ్వ, కూతురు అనిత, నాలుగేళ్ల వయస్సుగల మనవడు గణేష్‌తో కలిసి నిద్రించాడు. 14న తెల్లవారు జామున కూతురు కాలకృత్యాల కోసం లేచి గొళ్లెం తీసేందుకు యత్నించి విద్యుదాఘాతానికి గురై అరుస్తూ కిందపడిపోయింది. దీంతో తల్లి కూతురిని లేపి గొళ్లెం తీసేందుకు యత్నించి ఆమె సైతం విద్యుదాఘాతానికి గురైంది. భయంతో రాములుతోపాటు తల్లీ, కూతుళ్లు అరవగా చుట్టుపక్కల వారు పరుగెత్తుకుని వచ్చారు. ఇంటిబయటి భాగంలో తలుపు గొళ్లానికి పక్కనున్న విద్యుత్ మీటరునుంచి కనెక్షన్ ఇచ్చి ఎర్తింగ్‌కు బకెట్‌లో నీటిని నింపాడు. అందులో పెద్ద ఇనుపరాడ్ ఏర్పాటు చేసి గొళ్లానికి ఎర్తింగా వచ్చేవిధంగా ఏర్పాటు చేశాడు. అరుపులు విని అక్కడికి చేరుకున్న స్థానికులు ఆయా కనెక్షన్లను తొలగించి ఇంట్లోని వారిని సురక్షితంగా బయటకు తీశారు. ఆ తర్వాత రాములు తన పొలానికి వెళ్లి చూడగా అక్కడ రెండుబోర్లపై పెట్రోలు చల్లి నిప్పటించి నష్ట పర్చినట్లు గుర్తించాడు. ఈ విషయంపై నారాయణ ఖేడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాంకేతిక ఆధారంతో దర్యాప్తు చేపట్టగా రాములు అల్లుడైన కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామానికి చెందిన గొల్ల రమేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. రెండేళ్ల నుంచి తన భార్యను పుట్టింట్లోనే ఉంచుకుని పంపడంలేదని, భార్య, కుమారుడిని తీసుకెళ్లడానికి వస్తే పట్టించుకోవడంలేదని, అందువల్లే అత్తామామలతో పాటు భార్యను చంపడానికి యత్నించి బోర్లకు నష్టం కల్గించానని విచారణలో ఒప్పుకున్నట్టు తెలిపారు. నిందితుణ్ని అరెస్టుచేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ, ఎస్ఐ పేర్కొన్నారు.

చెరువులు నింపాలంటూ రైతుల రాస్తారోకో


వెలికట్ట క్రాస్ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్నరైతులను విరమించాలని చెబుతున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లోని రైతులు మంగళవారం సాగు నీటి కోసం రాజీవ్ రహదారిపై రెండు చోట్ల వేర్వేరుగా రాస్తారోకో నిర్వహించారు. దుద్దెడలో వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ సీఐ భాను ప్రకాష్ రైతులు రాస్తారోకో చేయకుండా అడ్డుకునే యత్నం చేశారు. అదనపు పోలీస్ బలగాలను రెండు చోట్ల మొహరింపచేశారు. పోలీసులు రాస్తారోకో నుంచి రైతులను బలవంతంగా లాక్కెళ్లే ప్రయత్నంలో తోపులాటలు జరిగాయి. అక్కడ వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. రైతులు వినకపోతే వారిని బలవంతంగా ఇడ్చుకెళ్లి పోలీస్ వాహనాల్లో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్, కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్లకు వారిని తరలించారు. అనంతరం గంట తరువాత స్వంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా రైతులు పర్శరాములు, సత్యం, రాజు, వేణులు మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా గత 6 ఏళ్లుగా కొండపాక మండలంలోని చెరువులను గోదావరీ నదీ జలాలతో నింపుతున్నారన్నారు. ఈ క్రమంలోనే చెరువుల్లో నీరు నింపకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదన్నారు. వర్షాలు సంవృద్ధిగా కురువకపోవడంతో మూడు గ్రామాల్లో చెరువులు నిండక భూగర్భజలాలు ఇంకుతున్నాయన్నారు. దీంతో వేసిన వరి పంటలు ఎండిపోవడమేకాకుండా పెట్టిన పెట్టుబడులు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకొని చెరువుల్లోకి నీటిని విడుదల చేయాలని కోరారు. రైతులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాకు సిద్ధం

ఓట్లు వేసి గెలిపించుకున్న ప్రజల సమస్యలు పరిష్కరించ లేనప్పుడు పదివిలో కొనసాగడం బాధాకరమని అంకిరెడ్డిపల్లి సర్పంచ్ బడేకోలు లావణ్య భర్త మాజీ సర్పంచ్ నర్సింలు పేర్కొన్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించని యెడల సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తామన్నారు.